క్లుప్తంగా

ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీ

గజ్వేల్‌రూరల్: ఎస్‌ఎఫ్‌ఐ గజ్వేల్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. బుధవారం గజ్వేల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడిగా వంశీ, కార్యదర్శిగా ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా అభికృష్ణ, అరుణ్‌కుమార్, అంజలి, సహాయ కార్యదర్శులుగా రాజశేఖర్, భానుప్రసాద్, జ్యోతిలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, లోకేష్, వికాస్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్ఐ గంగరాజు

దుబ్బాక: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని ఎస్ఐ గంగరాజు అన్నారు. పట్టణంలోని బాలాజీనగర్ కాలనీ వాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని బాలాజీనగర్ కాలనీలో అన్ని ఇండ్లు, రోడ్లు కవర్ అయ్యేలా 25 వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం హర్షణీయం అన్నారు. కాలనీని ఆదర్శంగా తీసుకొని పట్టణంలోని అన్ని కాలనీలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు వడ్లకొండ శ్రీధర్, పర్స కృష్ణ, నిమ్మ వెంకట రాజశేఖర్‌రెడ్డి, వడ్లకొండ రమేష్, సప్తగిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఈయూ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

హుస్నాబాద్: హుస్నాబాద్ ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో బుధవారం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసీఈయూ) ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడిగా పెద్ది సదాశివరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కరుణాకర్, కార్యదర్శిగా రాజేష్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా వెంకటరాజం, అశోక్‌కుమార్, కోశాధికారిగా కిషన్, ఈసీ సభ్యులుగా రాజేంద్రప్రసాద్, శంకర్‌కుమార్ అవంతిని ఎన్నుకున్నారు.

పట్టభద్రులూ.. ఓటు అమ్ముకోవద్దు



ఓటు అభ్యర్థిస్తున్న స్వతంత్ర అభ్యర్థి శ్రీనివాస్

దుబ్బాక: పట్టభద్రులు డబ్బులకు ఆశపడి ఓటును అమ్ముకోవద్దని, ఆలోచించి న్యాయం కోసం నిలచిన తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి మచ్చ శ్రీనివాస్ కోరారు. బుధవారం దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట- భూంపల్లి మండలాల్లో పర్యటించి పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో డబ్బుల ప్రమేయం లేకుండా న్యాయబద్ధంగా ప్రజలకు సేవచేసే వారినే నిజాయితీగా ఎన్నుకోవాలనే ఆశయంతో ఎన్నికల్లో పోటీచేస్తున్నట్లు తెలిపారు. గెలిపిస్తే పేద విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, తునికి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంజిరెడ్డిని ఆదరించండి



సమావేశంలో మాట్లాడుతున్న సుచిత్ర

హుస్నాబాద్: ఎలాంటి లాభాపేక్ష లేకుండా 25 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి కూతురు సుచిత్ర అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, న్యాయవాదులను కలిశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులకు యూనిఫామ్స్, షూస్ అందజేశామన్నారు. నిరుద్యోగ యువతకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రశ్నించే గొంతుక అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ మోహన్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు తోట స్వరూప, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వయంపాలన



మిరుదొడ్డి(దుబ్బాక): మోతెలో జరిగిన స్వయం పాలనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన చేశారు. డీఈవోగా లక్ష్మణాచారి, హెచ్ఎంగా దుద్దెడ వర్షిత, ఉపాధ్యాయులుగా కమతం లాస్య, నిత్యశ్రీరామ్, అక్షిత, లాస్య, ప్రణతి వ్యవహరించారు. అనంతరం విద్యాబోధన చేసిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్రహం, టీచర్లు హరికృష్ణ, మల్లేశం, సత్యనారాయణ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. – మిరుదొడ్డి(దుబ్బాక)



విద్యార్థులను అభినందించిన ఎంఈఓ బచ్చలి సత్తయ్య

స్వయంపాలనలో ఉపాధ్యాయుల బాధ్యతలపై అవగాహన ఏర్పడుతుందని ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. కొండపాక మండలం తిప్పారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠ్యాంశాలను బోధించడం వల్ల పాఠశాల నిర్వహణపై అవగాహన ఏర్పడుతుందన్నారు. ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. – కొండపాక(గజ్వేల్)



గజ్వేల్‌రూరల్: బంగ్లా వెంకటాపూర్‌లోని ఎంపీహెచ్ఎస్‌లో..

గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్‌లోని మండల ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులైన మౌనిక డీఈఓగా, ఎంఈఓగా మమత, డిప్యూటీ డీఈఓగా ఆనంద్, హెచ్ఎంగా జశ్వంత్, ఉపాధ్యాయులుగా రాంచరణ్, కార్తీక్, మనోజ్, లక్ష్మి, గణపతి, అభిలాష్, అభిషేక్, భవాని, వైష్ణవిలు తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – గజ్వేల్‌రూరల్

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు బుధవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ ర్యాలీలు నిర్వహించారు. కొన్నిచోట్ల కొత్త కమిటీలను ఎన్నుకున్నారు. శివాజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు చెప్పారు.



తొగుట మండలం కాన్గల్‌లో..



గజ్వేల్‌రూరల్: బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శోభాయాత్ర



నంగునూరులో శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



మిరుదొడ్డిలో పాల్గొన్న యువకులు



మద్దూరులో ..

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

సీఐ లతీఫ్



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

తొగుట(దుబ్బాక): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని తొగుట సీఐ లతీఫ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదువుకున్న వారి భవిష్యత్ మంచిగా ఉంటుందని చెప్పారు. అపరిచిత వ్యక్తులు కాల్‌చేసినా, మెసేజ్‌లు పంపినా స్పందించవద్దని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అజమాత్‌బేగం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనం



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మత్తు పదార్థాలతో బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. బుధవారం త్రీటౌన్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలోని రంగధాంపల్లి చౌరస్తాలోని పలు హోటళ్లు, కిరాణా దుకాణాలు, పాన్‌షాప్‌లలో నార్కొటిక్ టీమ్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలను వినియోగించడం, విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. మత్తుపదార్థాలు ఎవరైనా కలిగి ఉన్నా, విక్రయించినా వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేయాలని ధర్నా



రోడ్డుపై బైఠాయించిన రైతులు

సిద్దిపేటరూరల్: పంటలను రక్షించుకునేందుకు రంగనాయక సాగర్ ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా సాగునీటిని విడుదల చేయాలని బుధవారం మండలంలోని రాఘవాపూర్ రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంగనాయక సాగర్ ప్రాజెక్టు నుంచి కాల్వల్లో నీటి ప్రవాహం తగ్గి పంటలకు సరిపడా నీరు అందని పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బంజేరుపల్లి మాజీ సర్పంచ్ శంకర్, మధు, వెంకటి, మల్యాల మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం

మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు



మాట్లాడుతున్న మండల విద్యాధికారి కనకరాజు

దౌల్తాబాద్ (దుబ్బాక): విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తామని దౌల్తాబాద్ మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు సూచించారు. మండల పరిధిలోని కోనాయిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రావణి, సీఆర్‌పీలు నగేష్,రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన బోధన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధన, మెరుగైన వసతులు లభిస్తాయని చిన్నకోడూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని రామంచ, చంద్లాపూర్, పెద్దకోడూరు పలు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్ ప్రాధాన్యం, ప్రభుత్వ కళాశాలలో ఉండే వసతుల గురించి వివరించారు. నాణ్యమైన విద్యతో పాటు వ్యక్తిత్వ నైపుణ్య మానవీయ విలువలు, సమాజంలో ఉన్నతంగా ఉండేలా విద్యార్థులను తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రతిభతోనే అవకాశాలు

గజ్వేల్‌రూరల్: యువత తమలోని ప్రతిభను చాటినప్పుడే అవకాశాలు లభిస్తాయని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ అన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్ మేళాను నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగ యువత ఓటమితో నిరాశ చెందకుండా తాము ఎంచుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు. ఈసందర్భంగా టీఎస్‌కేసీ, టాస్క్, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళాలో పరిసర ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతతో పాటు కళాశాలకు చెందిన విద్యార్థులు 150 మంది వరకు పాల్గొనగా, కళాశాలకు చెందిన 12 మంది, పరిసర ప్రాంతాలకు చెందిన మరో 13 మంది నిరుద్యోగ అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి

మద్దూరు(హుస్నాబాద్): సాగు పంటలకు క్రిమిసంహారక మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలని ఇన్సెక్టిసైడ్స్ ఇండియా కంపెనీ నిర్వాహకులు సూచించారు. మద్దూరు మండల పరిధిలోని సలాఖపూర్‌లో బుధవారం రైతులకు క్రిమిసంహారక మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...క్రిమిసంహారక మందుల పిచికారీ సమయంలో తప్పనిసరిగా ముఖానికి మాస్క్‌తోపాటు శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులను ధరించాలన్నారు. అనంతరం శుభ్రంగా స్నానం చేయాలని సూచించారు. గుట్కాలు, సిగరెట్, బీడీలు, శీతలపానీయాలు తాగకూడదన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు భాస్కర్, నాగరాజు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధిస్తాం

మిరుదొడ్డి(దుబ్బాక): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ గెలుపు ఖాయమని బహుజన లెబరల్ ఫ్రంట్ వ్యవస్థాపక చైర్మన్ శ్రీరాం రామకృష్ణ ప్రభు ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు రవీందర్ సింగ్‌కు వేసి గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు.

◆ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చేర్యాల(సిద్దిపేట): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఆకునూర్ గ్రామంలో ఎస్ఐ నీరేష్, వేచరేణిలో కొమురవెల్లి ఎస్ఐ రాజు గ్రామస్తులకు సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలు, స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్తులు కలిసిమెలిసి ఉండాలని అన్నారు. ఎన్నికలు వస్తుంటాయి, పోతుంటాయని వాటిని అడ్డం పెట్టుకొని గొడవలకు దిగొద్దని హెచ్చరించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక నిర్వహిస్తే వెంటనే 100కు డయల్ చేయాలని తెలిపారు.

◆ ఉత్తమ ఫలితాలు సాధించాలి

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగుని సురేశ్ గౌడ్ అన్నారు. బుధవారం మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది, ఇంటర్ పరీక్షలు విద్యార్థులకు ఈ పరీక్షలు తొలిమెట్టుగా ఉంటాయన్నారు. ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల కిందట వాహనాల తనిఖీ నిర్వహించాం. మద్యం తాగి పట్టుబడిన వారిని సిద్దిపేట కోర్టులో హాజరు పర్చాం. బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తి ఒకరికి రూ.500 జరిమానా, మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

◆ ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కావు

గజ్వేల్‌రూరల్: ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ధర్మారెడ్డిపల్లికి చెందిన సాయికిరణ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబాన్ని బుధవారం గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రి వద్ద పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని, క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుంటూ ఆత్మహత్యలకు పాల్పడొద్దని సూచించారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

ఆత్మీయ వీడ్కోలు సభలో ఎంఈవో ప్రవీణ్



ఎంఈవో జోగు ప్రభుదాసును సన్మానిస్తున్న వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): వృత్తిరీత్యా చేసిన సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని ఎంఈవో ప్రవీణ్‌బాబు పేర్కొన్నారు. మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో ఎంఈవోగా విధులు నిర్వహిస్తూ దుబ్బాకకు బదిలీపై వెళ్లిన ఎంఈవో జోగు ప్రభుదాసుకు స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్‌లో బుధవారం ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ... ప్రతీ ఉద్యోగికి బదిలీలు సహజమేనని అయితే వృత్తిపరంగా చేసిన సేవలు గొప్ప అనుభూతిని మిగులుస్తాయన్నారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు బద్దిరాజు, కృష్ణ, రామచంద్రం, యాదగిరి, తిరుపతిరెడ్డి, లక్ష్మణ్, ట్రస్మా ప్రతినిధులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు సారె అందజేత



సారెతో మహిళలు

హుస్నాబాద్: లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హనుమాన్ చాలీసా, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్థసారథి గీత మందిరం నుంచి మహిళలు సామూహికంగా బయలుదేరి లక్ష్మీవేంకటేశ్వర స్వామి వార్లకు ఒడి బియ్యం, సారె, సమర్పించారు. సంకల్ప సహిత పూజ చేశారు.

సాగులో సస్యరక్షణ తప్పనిసరి

శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి



పొద్దు తిరుగుడులో క్షేత్రస్థాయి పరిశీలన

చిన్నకోడూరు(సిద్దిపేట): పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని శాస్త్రవేత్త డా. పల్లవి సూచించారు. బుధవారం చిన్నకోడూరులో పొద్దు తిరుగుడులో గంధకం వాడకంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యాసంగిలో తక్కువ కాలం, తక్కువ నీటితో పొద్దు తిరుగుడు సాగు చేయవచ్చన్నారు. పొద్దు తిరుగుడులో గంధకం వాడటం వల్ల గింజ బరువు పెరిగి, నూనెశాతం పెరుగుతుందన్నారు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పారు. వివిధ పంటల సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ జయంత్‌కుమార్, ఏఈఓ సాత్విక, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



పాఠశాలకు ప్రింటర్‌ను బహూకరిస్తున్న ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఎన్ఆర్ఐ పెడుతల ప్రతాప్‌రెడ్డి చేర్యాల మండలంలోని ముస్త్యాల ప్రాథమిక పాఠశాలకు ప్రింటర్‌ను బహూకరించారు. ఈ మేరకు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనితకు అందజేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ...పాఠశాలకు శాశ్వత నిధిదాత పెడుతల ప్రతాప్‌రెడ్డి, బాలమణిల సేవలు అభినందనీయమన్నారు. ఇటీవల పాఠశాలకు కోతుల బెడద ఉండటంతో విద్యార్థులకు రక్షణగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటుతోపాటు రంగులు వేయించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వరూపరాణి, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్

నంగునూరు(సిద్దిపేట): పాలిటెక్నిక్ కళాశాలలో చేరిన విద్యార్థులకు త్వరగా ఉపాధి దొరకడంతో పాటు అనేక రకాల ప్రయోజనాలు చేకూరుతాయని రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్ సూచించారు. బుధవారం నంగునూరు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే కోర్సులు, ఉపాధి మార్గాలపై అవగాహన కల్పించి హెచ్ఎం రామస్వామితో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ.. కంప్యూటర్, డిప్లొమా కోర్సులు చదివే విద్యార్థులకు ఉజ్వల భవిషత్ ఉంటుందన్నారు. తమ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలీజెంట్, మెష్ లర్నింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, కంప్యూటర్ కోర్సులు కలిపి 24 కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.